ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శుక్రవారం 24 అక్టోబరు 2025





అగ్నిగుండంలో నడుస్తున్న హాసన్ జిల్లా అధికారి లతాకుమారి

12 రోజులు..26 లక్షల మంది భక్తులు

● ముగిసిన అమ్మవారి జాతర ● హాసనాంబదేవి ఆలయానికి తాళం



గర్భగుడికి తాళం వేస్తున్న అర్చకులు, అధికారులు

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : హాసనాంబ దేవీ దర్శనానికి తెర పడింది. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కృష్ణభైరేగౌడతో పాటు జిల్లాధికారులు సమక్షంలో ప్రధాన అర్చకులు హాసనాంబదేవి గర్భగుడికి తాళాలు వేశారు. మూల విరాట్టు ముందు వివిధ రకాల పూలతో పాటు నైవేద్యం ఉంచుతారు. దీంతో 15 రోజులుగా జరిగిన సిద్దేశ్వరజాతర కూడా ముగిసినట్లు అయ్యింది. ఆలయం వచ్చే ఏడాది అక్టోబరు 29న తెరువనున్నట్లు అర్చకులు ప్రకటించారు. హాసనాంబ దేవి ఆలయం ఏడాదికోసారి మాత్రమే తెరవడం ఆనవాయితీ. ఈనెల 9వ తేదీన హాసనాంబ దేవి ఆలయం తలుపులు తెరిచారు. తొలి రోజున ఆలయ సంప్రదాయాలను మాత్రమే పాటిస్తారు. తర్వాతి రోజు నుంచి భక్తుల దర్శనానికి అవకాశం ఇస్తారు. ఈ ఏడాది ప్రతి రోజూ లక్ష మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. గతంలో మాదరిగా కాకుండా వీఐపీల సంస్కృతిని పక్కన పెట్టారు. కేవలం కొందరికి మాత్రమే ప్రత్యేక దర్శనాల వెసలుబాటు కల్పించారు. రూ.300, రూ.1000 ప్రత్యేక టికెట్‌లను విక్రయించడం ద్వారా కోట్లాది రూపాయలు ఆదాయం వచ్చింది. వర్షాలు కురుస్తున్నా భక్తుల రద్దీ తగ్గలేదు. 15 రోజుల పాటు జాతర జరుగగా తొలి రోజు, చివరి రోజు హాసనాంబ దేవి దర్శనం ఉండదు. 13 రోజుల వ్యవధిలో 26.13 లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.



అమ్మకు చివరి హారతి..

అగ్నిగుండంలో నడిచిన జిల్లా అధికారి

హాసనాంబదేవి దర్శనం చివరి రోజున ఉత్సవ విగ్రహాలతో పాటు భక్తులు అగ్నిగుండంలో నడిచే సంప్రదాయం ఉంది. ఇలా వందలాది మంది మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాధికారి లతాకుమారి అగ్నిగుండంలో నడిచి భక్తిని చాటుకున్నారు. ఏడాదికోసారి మాత్రమే దర్శనభాగ్యం కలిగే హాసనాంబ ఉత్సవాల వేళ ఏటా ఏదో ఒక విధమైన వివాదం కొనసాగేది. దాదాపు దశాబ్ద కాలంలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా దర్శన ఏర్పాట్లు చేశారన్న ఖ్యాతి ప్రస్తుత జిల్లాయంత్రాంగంకు దక్కింది. ఉత్సవాల ప్రారంభం నుంచి ఇన్‌చార్జ్ మంత్రి కృష్ణభైరేగౌడ అక్కడే ఉండి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి రోజు భక్తుల రద్దీతో పాటు ఏర్పాట్లను ప్రత్యేకంగా పర్యవేక్షించేవారు. జిల్లాధికారి లతాకుమారి, ఎస్పీ మహమ్మద్ సుజిత తదితరులు అధికారులు సమైక్యంగా పనిచేశారు.

ఇటలీ టెంపుల్‌తోనే..



- అక్కడ కప్పం కడితేనే సీఎం పదవి
- టెంపుల్ రన్‌తో సమయం వృథా
- డీకేశీ ఆలయాల దర్శనంపై ప్రతిపక్ష నేత అశోక్

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంతోమంది కొలిచే చాముండేశ్వరి, మారెమ్మ ఆలయాలు కాంగ్రెస్ వారికి ఇష్టం కావని ఢిల్లీలోని ఇటలీ టెంపుల్ చుట్టూ ప్రదక్షిణ చేసి కప్పం కడితేనే డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారని ప్రతిపక్షనేత అశోక్ వ్యాఖ్యానించారు. దావణగెరెలో ఆయన గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డీకే శివకుమార్ దారితప్పిన బిడ్డలా ప్రవర్తిస్తున్నారని బెంగళూరు రోడ్లలో గుంతలు పూడ్చడం మాని టెంపుల్‌రన్ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పెద్ద దేవాలయానికి వెళ్ళకుండా సీఎం కాలేరన్నారు. నవంబర్ క్రాంతి గురించి తన వాఖ్యలతో కాంగ్రెస్‌లో అల్లకల్లోలం అయ్యిందంటూనే సిద్దరామయ్య సంధ్యా కాలం గురించి కుమారుడు యతీంద్రనే బహిరంగం చేశారన్నారు. బీహార్ ఎన్నికలకు కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన టార్గెట్‌ను తెలిపేందుకే మంత్రులకు సీఎం విందు ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నింటా విఫలం చెందిందన్నారు. కాగా యతీంధ్ర సిద్ధరామయ్య వ్యాఖ్యలపై రామనగర్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుసేన్ మాట్లాడుతూ యతీంద్రకు ఇంకా మాట్లాడటం రాదని ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉందన్నారు.



భీమణ్ణ (ఫైల్)

వాకింగ్ చేస్తున్న వృద్ధుడిని ఢీకొన్న కారు

- 50 అడుగుల దూరం ఎగిరిపడి దుర్మరణం
- బీదర్‌లో దుర్ఘటన

7

అర్కావతికి పూర్వవైభవం

● సబర్మతి నది తరహాలోనే అభివృద్ధి ● రూ.3వేల కోట్లతో ప్రణాళిక ● ప్రక్షాళనకు సిద్ధమైన జలమండలి


బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల క్రితం బెంగళూరుతోపాటు అనుబంధమైన జిల్లాలకు జీవనదిగా కొనసాగిన అర్కావతి నది కాలానుగుణంగా రూపురేఖలు కోల్పోయింది. నగరీకరణ, పారిశ్రామిక ప్రగతి వంటి కారణాలతో అర్కావతి కలుషితమైంది. కనీసం నది ఆనవాళ్లు కూడా కొన్నిచోట్ల లేకుండా పోయాయి. కాలువల రూపంలో కదులుతున్నా అటు పక్క వెళ్లాలంటే దుర్గంధం వెదజల్లడంతో ఇది అర్కావతి నది అనే విషయం చర్చించుకునేందుకు వీలు లేదనేలా మారిపోయింది.

ప్రతిపాదనలు సిద్ధం చేసిన జలమండలి

గుజరాత్ రాష్ట్రం అలహాబాద్‌కు అనుబంధమైన సబర్మతి నది తరహాలోనే అభివృద్ధి చేసేందుకు జలమండలి సిద్ధమైంది. అయితే భారీ ప్రాజెక్టు కావడంతో అందుకు తగిన నిధులు సమకూర్చుకోవడం కూడా జలమండలికి సవాల్ కానుంది. దీంతో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) ద్వారా ప్రాజెక్టును అమలు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రాథమికంగా సర్వే నివేదిక సిద్ధం చేశారు. సమగ్ర అధ్యయనం చేసేందుకు మరో రెండు మూడు నెలలు అవసరమని భావిస్తున్నారు. ఇలా డీపీఆర్ పనులు ఏడాది ఆఖరుకు పూర్తయితే 2026లో రాష్ట్రప్రభుత్వానికి ప్రస్తావనలను జలమండలి సమర్పించాలని నిర్ణయించింది. పీపీపీ పద్ధతిన అర్కావతి నది పునరుద్ధరణ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం ముందుకు కొత్త సంవత్సరంలో సమగ్ర నివేదిక చేరే అవకాశాలు ఉన్నాయి.

వాణిజ్యానికి వంద ఎకరాల భూమి


ఈ భారీ ప్రాజెక్టు పీపీపీ పద్ధతిన చేపట్టాలని నిర్ణయించిన మేరకు నది పునరుద్ధరణ తర్వాత నది ప్రదేశంలో ప్రైవేట్ వ్యక్తులకు వాణిజ్య పరమైన వ్యవహారాలకు అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం 'ఐడెక్' సంస్థ నది పరిసర ప్రాంతాలలో పలు వ్యాపారాలకు సిద్ధంగా ఉంది. ప్రాజెక్టు పరిధిలో ఎటువంటి వ్యాపారాలకు అవకాశం ఇవ్వాలనేది ట్రాన్సాక్షన్ అడ్వైజరీ సర్వీసెస్‌కు సంబంధించి సమగ్ర అధ్యయనం చేస్తోంది. ఈ నివేదిక తయారీ తుదిదశలో ఉంది. జలమండలి పరిశీలన జరిపి ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉంది. వాణిజ్య వ్యవహారాలకు 50-100 ఎకరాల భూమి అవసరం కానుందని భావిస్తోంది. అభివృద్ధి చేశాక వరద నిర్వహణ, కాలువలు, చెత్త నిర్వహణ, ఎస్‌టీపీల ఏర్పాటు, నది పునరుద్ధరణతోపాటు నది గట్టుపైన అభివృద్ధి, అటవీప్రాంతాన్ని తలపించేలా చెట్లు పెంచడం, ఉద్యానవనాల ఏర్పాటు, ప్రజలకు అవసరమైన సౌలభ్యాలు, నగర మౌలిక సదుపాయాలు సమకూర్చడం, వాణిజ్యపరమైన ఎంటర్‌టైన్‌మెంట్ సౌకర్యాలు కల్పించడమే ప్రాజెక్టు ఉద్దేశం.



నదికి అనుబంధమైన తిప్పగొండనహళ్ళి రిజర్వాయర్

బెంగళూరు జిల్లాలకు ప్రత్యేక నీటి వనరు

చిక్కబళ్ళాపుర జిల్లాకు అనుబంధంగా ఉండే నందికొండలనుంచి తిప్పగొండనహళ్ళి (టీజే హళ్ళి)దాకా 53.73 కిలోమీటర్ల మేర పునరుద్ధరణ చేపట్టడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశంగా ఉంది. ప్రాజెక్టుకు అనుబంధమైన ప్రదేశానికి సంబంధించి ప్రాథమిక సర్వే నివేదిక కూడా సిద్ధమైంది. ఈనివేదికకు అనుగుణంగా బెంగళూరు నగర, బెంగళూరు గ్రామీణ, బెంగళూరు దక్షిణ (రామనగర) జిల్లాలకు సంబంధించి 1449 చదరపు కిలోమీటర్ల పరిధి ఉండనుంది. ఇందులో ఐదు తాలూకాలు, 734 గ్రామాలతోపాటు నది పొడవునా ఉండే 77 గ్రామాలు, 10 చెరువులు, 13 పారిశ్రామిక ప్రదేశాలు, 3 రైల్వే క్రాసింగ్‌లతోపాటు జాతీయ రహదారి 4, మూడు రాష్ట్ర రహదారులతోపాటు ఇతర రోడ్లు కలిపితే 17 బ్రిడ్జ్‌లు రానున్నాయి. నదీ ప్రదేశంలో 15శాతం మాత్రమే జలమండలి పరిధిలోకి రానుంది. ఈ ప్రాజెక్టుకు 3వేల కోట్ల రూపాయలు ఖర్చు కానుందని అంచనా వేస్తున్నారు. కేంద్రప్రభుత్వ సహకారం కోరే అవకాశం కూడా ఉంది.



నగర సరిహద్దులో అర్కావతి నది

ప్రైవేటు పెట్టుబడులతో అభివృద్ధి పరుగులు

ప్రైవేట్ వ్యక్తులు, పెట్టుబడులు పెట్టడం ద్వారా ఆదాయాన్ని పొందే మార్గదర్శకాలు, సంస్కరించబడిన నీటిని విక్రయించడం, వాణిజ్య, వినోద కార్యక్రమాలు నిర్వహించడం, నది ముందు భాగాన అభివృద్ధి పనులు, ఎంటర్‌టైన్‌మెంట్‌పార్కులు, ప్రాజెక్టు అనుభవ కేంద్రం ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి. అర్కావతి నది అంటే బెంగళూరుకు అనుబంధంగా ఉందా అనే పరిస్థితి ఏర్పడింది. అటువంటిది సమగ్ర పునరుద్ధరణ ద్వారా నగరాన్ని మరింత సుందరీకరణ చేయడంతోపాటు నది అభివృద్ధితో భూగర్భజలాలను పెంచుకునేందుకు వీలుంటుందని జలమండలి భావిస్తోంది. అర్కావతి నది ద్వారా నగరంలో కూడా నీటి సమస్య తీరుతోందని భావిస్తున్నారు. జలయమండలి నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు.

పథ సంచలనానికి మరో అడ్డంకి

- ఆర్‌ఎస్‌ఎస్‌తోపాటే అనుమతికి గొండ కురుబల వినతి
- నవంబరు 2న ఆందోళనకు సిద్ధమైన భీమ్ ఆర్మీ

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీబీటీ శాఖా మంత్రి ప్రియాంకఖర్గే ప్రాతినిథ్యం వహిస్తున్న కలబురగి జిల్లా చిత్తాపురలో ఆర్‌ఎస్‌ఎస్ పథసంచలనం రోజునే మరో అడ్డంకిగా కురుబ కులస్తులు అడ్డంకిగా మారారు. చిత్తాపురలో ఈనెల 19న ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలనం జరపాలని భావించింది. ముందస్తుగా తహసీల్దార్‌కు అనుమతులు కోసం వినతిని ఇచ్చారు. ఇదే రోజునే భీమ ఆర్మీ కూడా పథసంచలనం చేస్తామంటూ అడ్డు తగిలారు. దీంతో తహసీల్దారు ఇద్దరికీ అనుమతులు ఇవ్వలేమని, ఇది భద్రత సమస్య కానుందని తేల్చి చెప్పారు. దీంతో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంచాలకులు హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే హైకోర్టు ధర్మాసనం 24వ తేదీన మరో పిటిషన్ దాఖలు చేయాలని సూచిస్తూనే నవంబరు 2న పథసంచలనానికి అనుమతి ఇచ్చారు. శాంతిభద్రతలు కాపాడుతూ పథసంచలనం నిర్వహించుకోవచ్చని అనుమతిచ్చారు. అయితే ఆర్‌ఎస్‌ఎస్ పథసంచలనం చేసే రోజునే మాకు అవకాశం ఇవ్వాలంటూ భీమ ఆర్మీ సవాల్ విసురుతున్నారు. ఇదే తరహాలోనే తాజాగా గొండకురుబ సమాజానికి చెందిన వారు ఎస్టీలుగా చేర్చాలంటూ పోరాటానికి సిద్దమయ్యారు. నవంబరు 2న ఆదివారం చిత్తాపురలో ఆందోళన చేస్తామని కలబురగి జిల్లాధికారికి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో అదే రోజున నిర్మిస్తామని పేర్కొన్నారు. కాగా సోషల్ మీడియాలో భీమ ఆర్మీ ప్రతినిధులు పలు విధాల పోస్ట్ చేస్తున్నారు. పలు విమర్శలతో సంఘ్‌పై దాడులు చేస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు లాఠీ ఖడ్గంతో ఊరేగింపు చేయడం ఎంతవరకు సమంజసమని, ఇది మత రక్షణ కాదని, ఉగ్రవాద చర్యలకు కారణం కానుందని ఎట్టి పరిస్థితులలోను ఆర్‌ఎస్‌ఎస్ పథసంచలనానికి అనుమతులు ఇవ్వరాదని డిమాండ్ చేస్తున్నారు.

కన్‌ఫాం హౌస్..!

- సొమ్ము చెల్లిస్తే చాలు ఆడబిడ్డో.. మగబిడ్డో చెప్పేస్తారు
- ఫాంహౌస్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు
- వైద్యాధికారుల దాడులు.. ముగ్గురి అరెస్ట్

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భ్రూణ లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరం. అయినా ఈ దందా కొన్నిచోట్ల కొనసాగుతోంది. తాజాగా మైసూరు సమీపంలోని ఒక ఫాంహౌస్‌లో భ్రూణ లింగ నిర్ధారణ చేయడాన్ని అధికారులు గుర్తించి దందాను రట్టు చేశారు. ఆరోగ్యశాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో ఒక మహిళ సహా ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ దందాలో బన్నూరుకు చెందిన ప్రముఖ నర్సింగ్‌హోం ప్రమేయం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. మైసూరు పరిధిలో మెల్లహళ్ళి సమీపాన హుణగనహళ్ళి లోని ఓ ఫాంహౌస్‌లో భ్రూణలింగ నిర్ధారణ చేస్తున్నట్లు గుర్తించారు. గర్భంలో ఉన్నది ఆడశిశువా లేదా మగ శిశువా అనేది నిర్ధారించి వేలాది రూపాయలు వసూలు చేసేవారని విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించి వరుణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ అంశంపై ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు గురువారం మీడియాతో మాట్లాడుతూ బన్నూరు హైవే సమీపంలోని ఒక ఫాంహౌస్‌లో అధికారులు కార్యాచరణ జరిపారన్నారు. దాడుల సందర్భంగా నలుగురు గర్భిణీలు లింగనిర్ధారణ కోసం వచ్చినట్టు గుర్తించారన్నారు. చట్టప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగుతోందన్నారు.



17నుంచి శనక్కాయల పరుష


బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏటా కార్తీక మాసం బసనవగుడిలో చివరి సోమవారం నిర్వహించే వేరుశనగకాయల పరుష నవంబరు 17న ఉంటుందని దేవదాయ శాఖా మంత్రి రామలింగారెడ్డి, ఎమ్మెల్యే రవిసుబ్రమణ్య తెలిపారు. గురువారం బసవనగుడిలో వారు మీడియాతో మాట్లాడుతూ శనక్కాయల పరుషకు ఏర్పాట్లు చేపట్టామన్నారు. కార్తీక మాసంలో ఏటా పరుష జరిగే రీతిలోనే కొనసాగిస్తామన్నారు. ఈ ఏడాది పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం పాటించాలని తీర్మానించామన్నారు. రెండుమూడేళ్లుగా ఇదే విధానం కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక బట్ట బ్యాగులను విడుదల చేశారు. కార్యక్రమంలో కట్టా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



క్లాత్ బ్యాగులను విడుదల చేస్తున్న మంత్రి రామలింగారెడ్డి, ఎమ్మెల్యే రవిసుబ్రహ్మణ్య

ఏ క్షణమైనా..!

- భారీ వర్షాలతో తుంగభద్రకు జలకళ
- జలాశయానికి భారీగా చేరుతున్న వరద
- 80 టీఎంసీలు దాటడంతో నీటి విడుదల యోచన
- దిగువ ప్రాంతాలను అప్రమత్తం చేసిన అధికారులు



వరద నీటితో నిండుగా ఉన్న తుంగభద్ర డ్యాం

బళ్లారి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర డ్యాం కు వరద పోటెత్తుతోంది. ఇన్‌ఫ్లో పెరుగుతున్న నేపథ్యంలో డ్యాం గేట్లు తెరిచి నదికి నీరు వదలాలని అధికారులు భావిస్తున్నారు. ఏక్షణమైనా గేట్లు తెరచి నీరు వదిలే అవకాశం ఉంది. డ్యాం కింది బాగం, నదీ పరీవాహక ప్రాంతాల గ్రామాలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని గురువారం తుంగభద్ర అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తుంగభద్ర డ్యాం నీటి నిల్వ సామర్థం 105.788 టీఎంసీలు, అయితే క్రస్ట్ గేట్ల పరిస్థితి నేపథ్యంలో డ్యాంలో నీరు 80 టీఎంసీల మాత్రమే నిల్వ చేయాలని సేఫ్టీ నిపుణుల కమిటీ సూచించిన సంగతి తెలిసిందే. నీటి నిల్వ 80 టీఎంసీలకు చేరడంతో నీరు వదలాలని అధికారులు భావిస్తున్నారు. గురువారం సాయంత్రం బోర్డు అధికారుల నీటి లెక్కల కొలతప్రకారం 21,697 క్యూసెక్కులకు చేరుకుంది. భద్ర, తుంగ డ్యాం నుంచి అలాగే వరద రివర్ నుండి నీరు డ్యాంకు పెరుగుతున్నాయి. గురువారం రాత్రి కానీ శుక్రవారం ఉదయం నీరు విడుదల చేస్తామని బోర్డు అధికారులు పేర్కొన్నారు. నది ఇక వానీవిలాస్ డ్యాం కూడా పొంగి పొర్లుతోంది. డ్యాం బ్యాక్ వాటర్ వైపు ఉండే గ్రామాల్లోకి ఇప్పటికే నీరు చేరింది. ఇప్పటికే డ్యాం ఈ ఏడాదిలో రెండు సార్లు నిండింది. పలు గ్రామాల ప్రజలు ఇప్పటికే జలదిగ్బంధంలో ఉన్నారు.



వీవీ సాగర్ ప్రాంతంలో గ్రామాల్లోకి చేరిన నీరు



డ్యాం నుంచి దిగువకు వస్తున్న నీరు

కెలవరపల్లి డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో



నీటి నురగలు

హోసూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): హోసూరులోని కెలవరపల్లి డ్యాంకు క్రమేపీ ఇన్‌ఫ్లో పెరుగుతోంది. గురువారం ఇన్‌ఫ్లో 1371 క్యూసెక్కులుగా ఉంది. మరోవైపు డ్యాం నుంచి తెన్‌పెన్నై నదిలోకి వదులుతున్న నీరు రసాయనాలతో నురుగు అధికంగా ఉండడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డ్యాం సామర్థ్యం 44.28 అడుగులు కాగా ప్రస్తుతం 40.67 అడుగులుగా ఉంది. గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలతో డ్యాంకు ఇన్‌ఫ్లో పెరుగుతోందని అధికారులు తెలిపారు. రసాయన వ్యర్థాలు రాకుండా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

అయ్యో.. గోపాల..!

- 25 ఏళ్లుగా గోపాలమిత్రలకు పెరగని వేతనం
- ఏ నెలా సక్రమంగా అందని పరిస్థితి
- పశుసంవర్ధక సహాయకులు చేసే పని చేసినా ప్రయోజనం ఏదీ





మంత్రి నారాలోకేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న గోపాల మిత్రలు

అనంతపురం అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగంలో చేరి 25 ఏళ్లు గడిచినా పైసా పెంపులేని జీతంతో పని చేస్తున్నామని గోపాలమిత్రలు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్యలు వినే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2000 సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు వైద్య సేవలు అందించేందుకు పదో తరగతి విద్యార్హతతో గోపాలమిత్రలను నియమించారు. అప్పట్లో రూ.6500 లు వేతనం ఇచ్చేవారు. ఇప్పటికీ అంతే వేతనం ఇస్తున్నారు. క్రమబద్ధీకరణ హామీని తుంగలో తొక్కిన గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా గోపాలమిత్రల మనుగడనే ప్రశ్నార్థకం చేసింది. తమ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని పశుసంవర్ధక సహాయకులుగా తీసుకోవాలన్ని వేడుకున్నా ప్రయోజనం లేకపోయింది. దీంతో గోపాలమిత్రల సంఘం ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టడం తో ఖాళీగా ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వారిని అనుసంధానం చేశారు.

ఐదు నెలలుగా వేతనం పెండింగ్..!

ఉమ్మడి జిల్లాలో 325 మంది గోపాలమిత్రలు పనిచేస్తున్నారు. వీరికి గత ఐదు నెలలుగా వేతనం పెండింగ్‌లో పెట్టారు. ఉద్యోగం చేరినప్పటి నుంచీ ఏ నెల కూడా సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి, కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోందని గోపాలమిత్రలు వాపోతున్నారు. వేతన బకాయిలు చెల్లించాలని సంబంధిత అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడి పశువులకు వైద్య సేవలు అందించడంతోపాటు కృత్రిమ గర్భధారణ, పాడి పశువులు, గొర్రెలకు బీమా చేయించడం, సీజనల్ వారిగా వ్యాధుల నివారణకు టీకా వేయడం తదితర పనులు గోపాలమిత్రలు నిర్వహిస్తున్నారు. పశువుల పోషణలో పాడి రైతులకు సూచనలు ఇవ్వడంతోపాటు పశుగ్రాసం పెంపకం ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని పశుసంవర్ధక సహాయకులు చేసే పనులే తామూ చేస్తున్నా తమకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేదని వారు వాపోతున్నారు. పశుసంవర్ధక సహాయకులకు నెలకు రూ.35వేలు వేతనం ఇస్తుంటే తమకు కేవలం రూ.6500లు ఇస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. ఉద్యోగ భద్రతలేకపోగా.. కనీస వేతనాలు ఇవ్వక పోవడంపై వారు ఆందోళన చెందుతున్నారు. తమకు కేటాయించిన విధులకు సంబంధించి కచ్చితమైన ప్రొసీడింగ్స్ ఉండాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు సమాన పనికిసమాన వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు.

వైసీపీ పాలనలో తీరని అన్యాయం

గత వైపీపీ పాలనలో గోపాల మిత్రలకు తీరని అన్యాయం జరిగింది. గత టీడీపీ పాలనలో గోపాలమిత్రలకు కృత్రిమ గర్భధారణ చేసినందుకు ఇన్‌సెంటివ్ ఇచ్చేవారు. ఒక్కొక్కరు నెలకు దాదాపు రూ.1500 నుంచి రూ.2వేలు ఇన్‌సెంటివ్ తీసుకునేవారు. సహజ మరణం, ప్రమాదవశాత్తు మరణించిన గోపాల మిత్రుల కుటుంబాలకు రూ.లక్ష పరిహారం అందించేవారు. వైసీపీ పాలనలో వీటిని ఆపేశారు. యువగళం పాదయాత్రలో గోపాలమిత్రల సమస్యలు పరిష్కరిస్తామని నారాలోకేశ్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గోపాలమిత్రల సంఘం నాయకులు మంత్రి నారా లోకేశ్‌ను మరోసారి కలిసి సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం సమర్పించారు. అయినా నేటికీ తమ వేదన తీరలేదని వారు పేర్కొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



గోపాల మిత్రలకు సమాన పనికి సమాన వేతనం అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. 25 సంవత్సరాలుగా నామమాత్రపు వేతనంతో పల్లెల్లో పశువులకు వైద్యసేవలు అందిస్తున్నాం. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటి దాకా నెలకు రూ.6500లు వేతనమే చెల్లిస్తున్నారు. గత ఐదు నెలలుగా పెండింగ్‌లోని వేతనాన్ని తక్షణమే చెల్లించాలి. మంత్రి ఇచ్చిన హామి మేరకు మాకు న్యాయం చేయాలి.

- వెంకటేశులు, గోపాల మిత్రల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి



గోపాల మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలి. గత వైసీపీ ప్రభుత్వంలో నిలిపేసిన ఇన్‌సెంటివ్‌లు, ఎక్స్‌గ్రేషియా తదితర సదుపాయలను పునరుద్ధరించాలి. గత వైసీపీ పాలనలో మరణించిన గోపాలమిత్రలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదు. ఆయా బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

- వైకుంఠవాసులు, గోపాల మిత్రల సంఘం జిల్లా కార్యదర్శి

డ్రిప్ పరికరాలను సక్రమంగా బిగించాలి

- ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను నిబంధనల మేరకు రైతుల పొలాల్లో బిగించాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక అనంతపురం ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాల నిర్వహణపై ఫీల్డ్ కోఆర్డినేటర్లు, ఎంఐ ఇంజనీర్లు, జిల్లా కోఆర్డినేటర్లకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ డ్రిప్ పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల పొలాల్లో ప్రాథమిక పరిశీలన నుంచి అన్ని రకాల పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. తగిన డాక్యుమెంట్లను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు మంజూరు చేసే విషయాన్ని ఆయా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపీ ఏపీడీ ధనుంజయ, ఎంఐఏఓలు, ఎంఐ ఇంజనీర్లు పాల్గొన్నారు.

రద్దీ నియంత్రణకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు కంటోన్మెంటు-కలబురగి (06557) ప్రత్యేక రైలు ఈ నెల 23న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06558) 24న నడుపుతున్నట్లు తెలియజేశారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, షాహాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. బెంగళూరు-బరైనీ (06247) ఈ నెల 23న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06248)ను 26న నడపనున్నట్లు వివరించారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, డోన్, కాచిగూడ, ఖాజీపేట్, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, జబల్పూర్, సట్నా, ప్రయాగరాజ్ చౌకీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్, బక్సర్, అర, దానాపూర్, పాటలీపుత్ర, సోన్‌పూర్, హాజీపూర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రవిప్రసాద్



మంత్రి పయ్యావుల కేశవ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న కమిటీ సభ్యులు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉరవకొండ ఎంపీడీఓ రవిప్రసాద్ ఎన్నికయ్యారు. జడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్సీ భవనంలో గురువారం ఆ సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జడ్పీ సీఈఓ శివశంకర్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రాప్తాడు ఎంపీడీఓ విజయలక్ష్మి, జనరల్ సెక్రటరీగా గుత్తి ఎంపీడీఓ ప్రభాకర్, జాయింట్ సెక్రటరీగా డీపీఆర్సీ జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్య, కోశాధికారిగా బొమ్మనహాళ్ ఎంపీడీఓ విజయ్ భాస్కర్, రాష్ట్ర ప్రతినిధిగా అనంతపురం రూరల్ ఎంపీడీఓ దివాకర్ ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా లక్ష్మీనరసింహ, మమతాదేవి, కుళ్లాయిస్వామి, వీరరాజు, ధనంజయ, విజయ భాస్కర్, తేజోత్సు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

విద్యాశాఖలో వలంటీర్లు..!

- నియామకం దిశగా అడుగులు
- టీచర్ల సర్దుబాటుకు విముఖత
- రాష్ట్రశాఖ ప్రతిపాదనలు.. విద్యాశాఖ జాబితా సిద్ధం

అనంతపురం విద్య, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల (వలంటీర్ల) నియామకానికి అడుగులు పడుతున్నాయి. సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నచోట వారిని నియమించుకునే దిశగా రాష్ట్ర అధికారులు చర్యలు చేపడుతున్నారు. మిగులు టీచర్ల సర్దుబాటుకు విముఖత చూపుతున్నారను. మెగా డీఎస్సీ నిర్వహించినా ఇంకా పలు ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. సబ్జెక్టు టీచర్‌లేని పాఠశాలలు ఉమ్మడి జిల్లాలో అనేకం ఉన్నాయి. విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో పాఠాలు చెప్పేవారే లేరు. దీంతో బోధన కుంటుపడుతోంది. పదో తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య మేరకు మిగులు టీచర్లను సర్దుబాటు చేయాలనుకున్నారు. ఇలా చేస్తే రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతాయనుకున్నారో.. ఏమోగానీ అధికారులు ఆ నిర్ణయాన్ని మార్చుకున్నారు. అవసరం ఉన్న పాఠశాలలకు ఎడ్యుకేషన్ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల (వలంటీర్ల)ను తాత్కాలికంగా నియమించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు జిల్లాలో ఎంతమంది సబ్జెక్టు టీచర్ల కొరత ఉందన్న వివరాలను పంపాలని విద్యాశాఖ కమిషనరేట్ నుంచి ఆదేశాలు అందాయి. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు, ఐటీ సెల్ సిబ్బందితో సమాచారం సేకరించి, రాష్ట్ర శాఖకు రెండురోజుల క్రితం పంపారు. దాదాపు అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో 500కిపైగా సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నట్లు లెక్కలు తీసి పంపినట్లు చెబుతున్నారు. ఎన్ని అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు అవకాశం కల్పిస్తారోనన్నది రాష్ట్ర శాఖ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని విద్యాశాఖ చెబుతోంది. బీఈడీ ఉన్నవారినే తీసుకుంటారా, డీఎడ్ వారికీ అవకాశం ఇస్తారా అనేదానిపై స్పష్టత లేదు. దీంతో కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి దొరకనుంది. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల ఎంపికపై మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

రాష్ట్రశాఖ నిర్ణయం మేరకే నియామకాలు

టీచర్ల కొరత ఉన్నచోట మిగులు టీచర్లను సర్దుబాటు చేస్తారనుకున్నాం. టీచర్ల సర్దుబాటు లేదని తెలుస్తోంది. బోధన కుంటుపడకుండా అవసరం ఉన్న స్కూళ్లకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో సబ్జెక్టు టీచర్ల కొరత వివరాలను రాష్ట్రశాఖకు పంపాం. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు ఇక్కడ నియామకాలు చేపడతాం.

- ప్రసాద్‌బాబు, డీఈఓ

రేపు జాబ్‌మేళా

గుంతకల్లుటౌన్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో గురువారం జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 25న ఉదయం జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు పాల్గొనవచ్చన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు.

ఆస్ట్రేలియాలో మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం



మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న దగ్గుపాటి మణిహాస్

అనంతపురం క్రైం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఆస్ట్రేలియాలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కుమారుడు దగ్గుపాటి మణిహాస్ ఘనస్వాగతం పలికారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్ మెల్‌బోర్న్‌లోని మెల్‌బోర్న్ యూనివర్సిటీలో కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడే కెమికల్ ఇంజనీరింగ్ మొదటి ఏడాది చదువుతున్న మణిహాస్.. మంత్రికి స్వాగతం పలికారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రకటనలో పేర్కొంది. మణిహాస్ తనను పరిచయం చేసుకోగానే... మంత్రి లోకేశ్ ఆప్యాయంగా పలకరించారు. చదువు, వాతావరణంపై ఆరాతీశారు. బాగా చదువుకుని రాష్ట్రానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని మంత్రి సూచించారు. 'రాష్ట్రాభివృద్ధి కోసం మీరు పడుతున్న తపన గురించి ఆస్ట్రేలియాలోని తెలుగువారే కాకుండా ఇక్కడి ప్రముఖులు కూడా చర్చించుకుంటున్నారని, మీరే స్ఫూర్తి' అంటూ మంత్రి వద్ద మణిహాస్ ప్రస్తావించారు. దీంతో బాగా చదువుకోవాలంటూ ఆయన మణిహాస్‌కు విషెస్ తెలిపారని ప్రకటనలో పేర్కొన్నారు.

కొత్త ఎత్తులు

- పింఛన్ల కోసం దొడ్డిదారిలో సర్టిఫికెట్లు
- భారీగా పెరిగిన దరఖాస్తులు
- తాత్కాలికంగా నిలిపివేసిన ప్రభుత్వం
- క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాతే మంజూరు ?



ఎమ్మెల్యే సింధూరా రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు (ఫైల్)

కొత్తచెరువు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్త పింఛన్ల కోసం కొందరు దొడ్డిదారిలో సర్టిఫికెట్లు పొందుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పింఛన్ సొమ్ము భారీగా పెరగడంతో దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. దీంతో ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరును తాత్కాలికంగా నిలిపివేసింది. ఈక్రమంలో అర్హులైనవారు కూడా పింఛన్ కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పింఛన్ల కోసం 8,325 మంది దరఖాస్తు చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అర్హుల్లో ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వం పెద్ద ఎత్తున అనర్హులకు పింఛన్లు ఇవ్వడంతోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు చెబుతున్నారు. ఈనేపథ్యంలో కొత్త పింఛన్ల మంజూరుకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరుగుతోంది. ముందుగా అనారోగ్యంతో మంచం పట్టిన పింఛన్‌దారులలో అర్హులెవరు అనే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం స్పౌజ్ ఆప్షన్ కింద పింఛన్లను మంజూరు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మైగ్రేషన్ ఆప్షన్ కింద తొలగింపు

వైసీపీ పాలనలో టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తల కుటుంబ సభ్యుల పింఛన్లను కొత్త కొత్త ఎత్తుగడలతో తొలగించారు. మమూడు నెలలు వరుసగా పింఛను తీసుకోకపోతే రద్దు అయ్యేలా నిబంధన అమలు చేశారు. ఈ సాకుతో వందలాది పింఛన్లను తొలగించారు. లబ్ధిదారులకు నివాసం ఉన్న గ్రామాల్లో పింఛన్ నగదును ఇవ్వాల్సి ఉంది. అయితే మైగ్రేషన్ ఆప్షన్ ఎత్తుగడతో లబ్ధిదారులకు తెలియకుండా వేర్వేరు గ్రామాలకు పింఛన్ నగదును బదిలీ అయ్యేలా చేస్తూ 3 నెలల కాలం గడిపి రద్దు చేశారని అప్పట్లోనే టీడీపీ సానుభూతిపరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంతా ఇప్పుడు కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హత ఉండి కూడా లబ్ధి పొందలేకపోతున్నారు.

వీడిన వైసీపీ గ్రహణం

పీఏబీఆర్ కుడి కాలువకు మరమ్మతులు

శరవేగంగా పనులు... అన్నదాతల హర్షం



యర్రగుంట సమీపంలో మరమ్మతుల అనంతరం కాలువ, రోడ్డు

రాప్తాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువకు ఆరేళ్లుగా వైసీపీ గ్రహణం పట్టింది. కాలువ మరమ్మతులకు పైసా కూడా నిధులివ్వలేదు. దీంతో కాలువలో కంపచెట్లు పెరిగిపోయి, పూడిక పేరుకుపోయి నీరు ముందుకు కదిలే పరిస్థితి ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం కాలువ మరమ్మతులు చేపట్టింది. కాలువతోపాటు అనుబంధంగా ఉండే రోడ్డు మరమ్మతులకు రూ.2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. దాదాపు పూర్తి కావచ్చాయి. ఆరేళ్ల తరువాత కాలువకు మరమ్మతులు చేపడుతుండడంతో వైసీపీ గ్రహణం వీడిందన్న చర్చలు వినిపిస్తున్నాయి. కాలువ మరమ్మతులతో చివరి ఆయకట్టుకు కూడా నీరు చేరనుంది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుడి కాలువ ద్వారా కూడేరు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు, కనగానపల్లి బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లోని 49 చెరువులకు నీరు సరఫరా అవుతాయి. త్వరలోనే నీటిని వదలనున్నట్లు కుడి కాలువ ధర్మవరం ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 17 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

దొంగల సవాల్ ..!

ఒక కేసు ఛేదించకముందే మరో నేరం

- వరుస దొంగతనాలతో ప్రజల బెంబేలు
- నామమాత్రంగా పోలీసుల గస్తీ
- నియంత్రణకు తగినంత సిబ్బంది కరువు



కేశవరెడ్డి పాఠశాలలో దొంగతనానికి పాల్పడుతున్న దొంగలు

బుక్కరాయసముద్రం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో గత కొద్ది రోజులుగా దొంగల బెడద ఎక్కువైంది. కాలేజీలు, ఆలయాలు, ఇళ్లు, వ్యవసాయ పొలాల్లో విద్యుత్ మోటార్లు, విద్యుత్ వైర్లు, డ్రిప్ వైర్లు, చివరికి పశువులను కూడా వదలడం లేదు. పోలీసులు ఒక కేసును ఛేదించకముందే మరో చోరీ చేస్తూ సవాల్ విసురుతున్నారు. సిబ్బంది కొరతతో నేరాలను నియంత్రించడం కష్టంగా మారిందని పోలీసులు చెబుతున్నారు. ఉన్నవారితో కనీసం గస్తీ కూడా నిర్వహించడం లేదని స్థానిక ప్రజలు పెదవి విరుస్తున్నారు.

జనాభా అనుగుణంగా... పోలీసు ఏదీ...!

జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న బుక్కరాయసముద్రం మండలంలో దాదాపు 75 వేల జనాభా ఉంది. వీటితో పాటు జాతీయ రహదారి, అమరావతి హైవేపై నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. సెంట్రల్ యూనివర్సిటీ, జిల్లాజైలు, ఓపెన్ ఎయిర్‌జైలు, వ్యవసాయ పరిశోధన కేంద్రాలు, పశు పరిశోధన కేంద్రం, గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఫ్యాక్షన్ గ్రామాలు ఏ గ్రేడ్ స్థాయిలో 3 గ్రామ పంచాయతీలు, బీ గ్రేడ్ సమస్యాత్మక గ్రామ పంచాయతీలు 4, అక్రమ రవాణా, ఇసుక, ఎర్ర మట్టి వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. ప్రస్తుతం స్టేషన్‌లో ఒక సీఐ, ఇద్దరు ఎస్ఐలు, ముగ్గురు ఏఎస్ఐలు ఉండగా అందులో ఒక ఏఎస్ఐ డీఎస్పీ కార్యాలయం అటాచ్‌లో ఉన్నారు. ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లలో ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఒకరు మెడికల్ లీవ్‌లో, మరొకరు హైవే పెట్రోలింగ్‌కు వెళ్లారు. 18 మంది కానిస్టేబుళ్లు ఉండగా కోర్టు డ్యూటీ 2, స్పెషల్ పార్టీకి 1, స్టేషన్‌లో కంప్యూటర్ వర్క్ 2, రైటర్లు 3 ఉన్నారు. మిగిలిన పది మంది సిబ్బంది మండలం అంతా పర్యవేక్షించాలంటే చాలా కష్టంగా ఉంది. స్టేషన్ అప్‌గ్రేడ్ అయినా నిబంధనల మేరకు ఉండాల్సినంత మంది సిబ్బంది లేరు. దీంతో సిబ్బందికి లీవ్ దొరకాలన్నా కూడా కష్టంగా మారింది.

మచ్చుకు కొన్ని...



బీరువాలో నగదును ఎత్తుకెళ్లిన దొంగలు

- ఈ నెల 2న బుక్కరాయసముద్రం పరిధిలోని దక్షిణామూర్తినగర్‌లో రెండు ఇళ్లలో వరుస చోరీలు జరిగాయి. రూ.లక్షల విలువైన బంగారం ఆ భరణాలు చోరీ అయ్యాయి.
- ఈ నెల 5న వడియంపేట గ్రామంలో నాలుగు కార్పొరేట్ కళాశాలల్లో చోరీ జరిగింది. దాదాపు రూ. 4 లక్షలు ఎత్తికెళ్లారు.
- ఈ నెల 7న బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ ఆటో వెళ్తుండగా ఇద్దరు మహిళా దొంగలు మాటల్లో పెట్టి ఆమె నుంచి రూ. 4లక్ష విలువైన బంగారు చైను కాజేశారు.
- గత నెల 13న బుక్కరాయసముద్రంలో రాత్రిపూట మద్యం దుకాణంలో చొరబడి రూ.20వేలు, మద్యం ఎత్తికెళ్లారు.
- ఆగస్టు 6న బుక్కరాయసముద్రంలో గౌరవయ్యసేను కొట్టాలలో ఆరు తులాల బంగారం, రూ.3.3లక్షల నగదు చోరీ చేశారు. అయితే ఈ ఘటనలో పోయిన సొమ్మును రికవరీ చేశారు.
- జూలై 21 స్థానిక ముసలమ్మకట్ట వద్ద ఉన్న ముసలమ్మ ఆలయంలో హుండీలో ఉన్న రూ.2లక్షలు చోరీ చేశారు. ఈ ఘటనలో దొంగలు ఆచూకీ తెలియలేదు. అయితే గత నెలలో దొంగతనం చేసిన డబ్బును తిరిగి ఆలయంలో పడేసి వెళ్లారు.
- మండలంలో పసులూరు గ్రామం వద్ద వెళ్లే రహదారిలో మే 3న బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన గొర్రెల వ్యాపారి నారాయణస్వామి అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామానికి వెళ్తుండగా రూ. అతని నుంచి రూ.6.80లక్షలను దోపిడీ చేశారు.



బీకేఎస్‌లో ఇటీవల మద్యం దుకాణంలో చోరి గురించి విచారిస్తున్న పోలీసులు

కట్టడి చేస్తాం



బుక్కరాయసముద్రం మండలం విస్తీర్ణంలో చాలా పెద్దది. ప్రస్తుతం ఉన్న సిబ్బంది నేర నియంత్రణకు సరిపోవడం లేదు. సిబ్బందిని పెంచి దొంగతనాలు జరగకుండా నియంత్రిస్తాం. బ్లూకోల్ట్స్‌కు నలుగురిని కేటాయిస్తాం. ప్రస్తుతం జరిగిన చోరీలపై ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేస్తున్నాం. త్వరలోనే నేరస్తులను పట్టుకుంటాం. గ్రామాల్లో ఇంటికి తాళాలు వేసి వెళ్లే సమయాల్లో పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. అలాగే విలువైన వస్తువులు, బంగారం ఇంట్లో పెట్టకుండా భద్రత ఉండే ప్రదేశాల్లో పెట్టాలి.

- వెంకటేశులు, రూరల్ డీఎస్పీ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

ఆర్‌కే లక్ష్మణ్ (జయంతి)



'పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత ఆర్‌కే లక్ష్మణ్‌గా ప్రసిద్ధులైన రాశి పురం కృష్ణస్వామి అయ్యర్ లక్ష్మణ్ 1921 అక్టోబరు 24న మైసూరులో జన్మించారు. వ్యంగ్యచిత్రకారులలో ఒకరు. ఆయన సృష్టించిన 'కామన్ మ్యాన్' పాత్ర కార్టూన్‌ల చరిత్రలో అత్యంత పేరొందింది. ఆయన కార్టూన్‌లు ప్రముఖ పత్రికలలో ప్రచురితమయ్యాయి. మైసూరు యూని వర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్, కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారం, జర్నలిజం సేవలకు రామన్ మెగసెసె పురస్కారం అందుకున్నారు. 2015 జనవరి 26న కన్నుమూశారు.

మన్నా డే (వర్ధంతి)



ప్రముఖ నేపథ్యగాయకుడు 1919 మే 1న కోల్కత్తాలో జన్మించారు. భారత సినీ రంగంలోనే అత్యంత ప్రతిభావంతుడైన గాయకుడిగా పేరొందారు. 1950 నుంచి 1970 వరకు హిందీ సినీ రంగంలో 3,500 కు పైగా పాటలు పాడారు. 1942లో 'తమన్నా' సినిమాతో నేపథ్యగాయకుడిగా మారారు. సచిన్‌దేవ్ బర్మన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేశారు. షోలే, మేరానామ్ జోకర్, బర్సాత్‌కీ ఏక్ రాత్, సఫర్, సాఖీ తదితర సినిమాల పాటలకు ఎంతో గుర్తింపు వచ్చింది. 2007లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించారు. పద్మశ్రీ, పద్మభూషణ్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2013 అక్టోబరు 24న కన్నుమూశారు.

విలియమ్ మార్క్ టల్లీ (పుట్టినరోజు)



సర్ విలియమ్ మార్క్ టల్లీ 1935 అక్టోబరు 24న జన్మించారు. బ్రిటీష్ వ్యాపారవేత్త కుమారుడైన ఆయన బాల్యం ఇండియాలో గడిచింది. బీబీసీ న్యూఢిల్లీ బ్యూరో చీఫ్‌గా 20సంవత్సరాలు వ్యవహరించారు. 9 పుస్తకాలు రచించారు. పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. 1985లో ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్ గౌరవహోదా పొందారు. ముంబై ప్రెస్‌క్లబ్ నుంచి రెడ్ ఇంక్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.

అంతర్రాష్ట్ర మెట్రోకు బ్రేక్

● హోసూరుకు మెట్రో మార్గం అసాధ్యం ● కన్నడ సంఘాల ఒత్తిడితో బీఎంఆర్‌సీఎల్ ప్రకటన



బెంగళూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలి అంతర్రాష్ట్ర మెట్రో రైలు రానుందంటూ కొంతకాలంగా సాగుతున్న చర్చలకు బెంగళూరు మెట్రో రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్ నమ్మ మెట్రో బ్రేక్ పెట్టింది. ప్రస్తుతం బెంగళూరు నగర పరిధిలోని ఎలక్ట్రానిక్ సిటీ నుంచి బొమ్మసంద్ర దాకా మెట్రోసంచారం ఉంది. అక్కడి నుంచి రెండు మూడు కిలోమీటర్‌లు వెళితే సరిహద్దు రానుంది. అక్కడి నుంచి తమిళనాడులోని ప్రధాన వ్యాపార వాణిజ్య కేంద్రమైన హోసూరుకు జాతీయ రహదారికి అనుబంధంగా మెట్రో ఏర్పాటు చేసే ప్రతిపాదనలను చెన్నై మెట్రో ప్రస్తావించింది. అయితే ఈ ప్రస్తావనపై కన్నడ సంఘాలు తీవ్రంగా మండిపడ్డాయి. నమ్మ మెట్రో కర్ణాటకకు మాత్రమే పరిమితంగా ఉండాలని డిమాండ్ చేశారు. కర్ణాటక, తమిళనాడుల మధ్య కావేరీ జలాల విషయమై రెండు రాష్ట్రాల మధ్యన పలుమార్లు తీవ్రమైన పోరాటాలు సాగాయి. ఇటువంటి తరుణంలో కర్ణాటక రాష్ట్ర ప్రజలు పన్ను రూపంలో చెల్లించిన సొమ్ముతో హోసూరుకు ఎలా మెట్రో ఏర్పాటు చేస్తారని సంఘాలు మండిపడ్డాయి. అదే జరిగితే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించాయి. దీంతో బీఎంఆర్‌సీఎల్ హోసూరు దాకా నిర్మాణాలు చేపట్టలేమని ప్రకటించింది. చెన్నై మెట్రో కార్పొరేషన్ మరోసారి కర్ణాటక ప్రభుత్వానికి వినతి పంపనున్నారా లేక వారు అసాధ్యమని భావించి వదులుకోనున్నారా అనేది తేలాల్సి ఉంది.

మూడు కేపీఎస్‌లకు ప్రభుత్వం అనుమతి: ఎమ్మెల్యే

బాగేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బాగేపల్లి తాలూకాలో మూడు కొత్త కర్ణాటక పబ్లిక్ స్కూల్ (కేపీఎస్)లకు అనుమతి లభించిందని ఎమ్మెల్యే సుబ్బారెడ్డి వెల్లడించారు. పట్టణంలో గురువారం ఆయన గృహకార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని బాలుర ప్రాథమికోన్నత పాఠశాల, పాతపాళ్య, చాకవేలు పాఠశాలల్లో కర్ణాటక పబ్లిక్‌స్కూల్‌ను తెరిచేందుకు చేసిన మనవిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అనుమతి ఇచ్చిందన్నారు. ప్రతి పాఠశాలకు రూ.4కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యం ఉందన్నారు. కేపీఎస్ ద్వారా ఎల్‌కేజీ నుంచి 12వ తరగతి వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశంతోపాటు గుణాత్మక విద్యకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. తద్వారా పిల్లల్లో నేర్చుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఈ పాఠశాలలు ఉంటాయన్నారు. తాలూకాకు మూడు కేపీఎస్‌లకు అనుమతి లభించడంపై పీయూ కళాశాల ప్రిన్సిపాల్ నంజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్, ప్రభుత్వ మాదిరి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పబ్లిక్‌స్కూళ్ల ప్రధాన ఉద్దేశ్యం విద్యాప్రమాణాలు, గుణాత్మకతను పెంచడం అన్నారు. అదనపు తరగతి గదులు, గదులు, ప్రయోగాలయాలు, ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం వంటివి అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రతి పాఠశాలలో 30మందికి అడ్మిషన్‌లకు అవకాశం కల్పిస్తామన్నారు. అంతకంటే ఎక్కువ అర్జీలు వస్తే లాటరీ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

26న వారధి తెలుగు సదస్సు

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : బెంగళూరుకు చెందిన మా తెలుగుతల్లి, తెలుగు విజ్ఞాన సమితిల సహకారంతో మహారాష్ట్ర తెలుగుఫెడరేషన్ సంస్థ ఈనెల 26న గోవాలో 'వారధి' పేరిట తెలుగు సదస్సు నిర్వహిస్తున్నారు. ఇదే విషయాన్ని తెలుగు విజ్ఞాన సంస్థ అధ్యక్షుడు రాధాకృష్ణరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గోవా వారధి ఉత్సవాలకు ముఖ్యఅతిథులుగా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు హాజరవుతున్నట్లు తెలిపారు. గోవా రాష్ట్రం వాస్కోడిగామా బైనా ప్రాంతంలోని రవీంద్రభవన్‌లో ఆదివారం ఉదయం 9.30గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. ఉదయం మా తెలుగుతల్లి మూడవ వార్షికోత్సవం జరుగనుందన్నారు. తెలుగు సంఘాలు నేటి ఆవశ్యకత అనే అంశంపై చర్చాగోష్ఠి ఉంటుందన్నారు. ఆతర్వాత వారధి సదస్సు ఉంటుందని గోవా గవర్నర్ ముఖ్యులుగా పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం సత్యసాయి బాబా శతవర్ష జయంతి వేడుకలు జరుపుతామన్నారు. గోవాలో జరిగే తెలుగు సభకు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన తెలుగు ప్రముఖులు హాజరువుతారన్నారు. తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుతున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యక్తి హత్య

తాడిపత్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబీరోడ్డు అభిరుచి హోటల్ సమీపంలో గురువారం తెల్లవారుజామున రాజు (52) అనే వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు హత్య చేసినట్లు సీఐ ఆరోహణరావు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన రాజు పెయింటింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతడికి మద్యం తాగే అలవాటు ఉండేది. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లలేదన్నారు. ఏం జరిగిందో తెలియదు గానీ తెల్లవారుజామున హత్యకు గురయ్యాడన్నారు. మృతదేహాన్ని పరిశీలించగా రాళ్లతో దాడి చేసి చంపినట్లు గుర్తించామన్నారు. భార్య ఉత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసం

ఉరవకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోమ్ పేరుతో పలువురు నిరుద్యోగులను మోసగించిన విషయం ఉరవకొండలో వెలుగు చూసింది. ఓ కంపెనీ వ్యాట్సాప్ ద్వారా వర్క్ ఫ్రం హోమ్‌తో శాశ్వత ఉద్యోగాలు కల్పిస్తామని మెసేజ్‌లు పంపారు. నెలకు రూ.15 నుంచి రూ.30వేల వరకూ సంపాదించవచ్చని ఆశ చూపారు. సంప్రందించిన కొందరు నిరుద్యోగులకు ఉద్యోగం కావాలంటే ఫోన్ పే చేయాలని చెప్పారు. వారి మా టలు నమ్మిన కొందరు నిరుద్యోగులు రూ.6 వేలు, రూ.12వేలు ఫోన్ పే చే శారు. ఉరవకొండ పరిసర ప్రాంతాల్లో ఇలా 50 మందిదాకా డబ్బులు చె ల్లించారు. ఆన్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని నమ్మించారు. ఆ త ర్వాత ఫోన్ స్విచాఫ్ చేయడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మోసపోయిన బాధితులు వివరాలను వెల్లడించడానికి నిరాకరిస్తున్నారు.

వాకింగ్ చేస్తున్న వృద్ధుడిని ఢీకొన్న కారు..

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వాకింగ్ చేస్తున్న వృద్ధుడిని వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఏకంగా 50 అడుగుల దూరంలో ఎగిరిపడి దుర్మరణం చెందిన సంఘటన బీదర్‌లో చోటు చేసుకుంది. గురువారం తెల్లవారు జామున 5.30 గంటలవేళ జిల్లాకేంద్రమైన బీదర్‌లోని కుంబరవాడ కాలనీలో భీమణ్ణ (76) వాకింగ్ చేస్తుండగా, వెనుక వైపు నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొంది. కారు ధాటికి డిక్కీ పైభాగం నుంచి ఏకంగా కారుపైభాగాన పడి సుమారు 50 అడుగుల దూరం మేర భీమణ్ణ ఎగిరి పడ్డారు. రోడ్డు పక్కన పడిన భీమణ్ణ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. బీదర్ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.



విత్తనం వేస్తున్న రైతులు

8 గంటల్లో 20 ఎకరాల్లో విత్తనం

బొమ్మనహాళ్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని గోవిందవాడ గ్రామానికి చెందిన ఎర్రిస్వామి తన ఎద్దులతో ఏకంగా 8 గంటల వ్యవధిలో 20 ఎకరాల్లో అలసంద విత్తి, శెభాష్ అనిపించుకున్నాడు. గ్రామానికి చెందిన చెన్నబసయ్యకు చెందిన పొలంలో గురువారం విత్తనం వేశాడు. తెల్లవారుజామున 5 గంటలకు కాడెద్దులతో విత్తు పని ప్రారంభించిన ఆయన మధ్యాహ్నం ఒంటి గంటకు 20 ఎకరాల్లో పూర్తి చేశాడు.

బీటీపీకి వరద



బీటీపీలో చేరిన వరదనీరు

రాయదుర్గం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బీటీపీ(భైరవానితిప్ప ప్రాజెక్టు)లోకి ఎగువ కర్ణాటక నుంచి వరదనీరు ఉధృతంగా వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 700 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశాలున్నట్లు ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో శుక్రవారం క్రష్ట్‌గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం రెండు టీఎంసీలు కాగా ఇప్పటికే 1.57 టీఎంసీలు చేరాయి. ఎగువన కర్ణాటకలోని వాణివిలాస్ సాగర్ నిండిపోవడంతో అక్కడి నుంచి రెండువేల క్యూసెక్కులకుపైగా నీటిని అవుట్‌ఫ్లో చేస్తున్నారు. దీంతో ఆ నీరంతా బీటీపీకి చేరే అవకాశం ఉంది. ఇన్‌ఫ్లో పెరిగి, నీటిని దిగువకు విడుదల చేయనున్న నేపథ్యంలో దిగువన నదీ పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలకు ఇరిగేషన్ అధికారులు అప్రమత్తం చేశారు.

నేడు, రేపు సైన్స్ ప్రాజెక్టులపై సదస్సులు

అనంతపురం విద్య, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): సైన్స్ టీమ్స్ వివరాలు, సైన్స్ ప్రాజెక్టుల నమోదు, ప్రాజెక్టుల ఎంపికపై అవగాహన కల్పించడం కోసం శుక్ర, శనివారాల్లో సదస్సులు ఏర్పాటు చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, సైన్స్ సెంటర్ అధికారి బాలమురళి గురువారం ఓప్రకటనలో తెలిపారు. వికసిత్ భారత్ బిల్డ్ థా న్- 2025 కార్య క్రమానికి విద్యార్థుల నుంచి నూతన ఆలోచనలు, శాస్త్రీయ పరిష్కారాల ఆవిష్కరణకు సంబంధించి ఈసదస్సుల్లో అ వగాహన కల్పిస్తారన్నారు. శుక్రవారం ఉదయం గుంతకల్లు , మ ధ్యాహ్నం కళ్యాణదుర్గం డివిజన్ లకు, శనివారం ఉదయం అనంతపురం డివిజన్, మధ్యాహ్నం అన్ని ప్రైవేట్ పాఠశాలలకు ఈసదస్సులు కొనసాగుతాయన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాల నుంచి ఒక సైన్స్ టీచర్, ఒకవిద్యార్థి తప్పనిసరిగా హాజరయ్యేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని డీఈఓ ఆదేశించారు.

పెళ్లి పేరిట...

●ప్రసవించిన బాలిక

యాడికి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ బాలికను గర్భవతిని చేసిన రాజ అనే వ్యక్తిపై యాడికి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. యూపీఎస్ సీఐ ఈరన్న తెలిపిన మేరకు, నిందితుడు కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణవాసి. బాధిత బాలిక యాడికి మండలంలోని ఓ గ్రామంలో పదో తరగతి వరకు చదివింది. ఆ తరువాత చదువు మానేసి కర్నూలు జిల్లా మద్దికెరలోని తన నాన్నమ్మ ఇంట్లో ఉండేది. మద్దికెరకు ఒక వివాహంలో పాల్గొనేందుకు వచ్చిన రాజ.. బాలికకు పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. దసరా పండుగకు తల్లిదండ్రుల వద్దకు వచ్చిన బాలిక, ఈ విషయం గురించి తెలియజేసింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే గర్భందాల్చిన బాలిక, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో బుధవారం రాత్రి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక గురువారం తెల్లవారుజామున ఆడబిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు బాలిక తల్లిదండ్రులు ఉంటున్న ప్రాంతానికి వెళ్లి విచారించారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అంగన్‌వాడీ వర్కర్, మహిళా సంరక్షణ కార్యదర్శి స్టేషన్‌కు వెళ్లారు. బాలిక అనంతపురంలో ప్రసవించినందున, అక్కడే ఫిర్యాదు చేయాలని పోలీసులు వారికి సూచించారు. దీంతో వారు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు.

దరఖాస్తు చేసుకోండి

బుక్కపట్నం/అనంతపురం విద్య, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం డైట్ కళాశాలలో డెప్యుటేషన్‌పై బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అనంతపురం డీఈఓ డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం ఉంటుందన్నారు. ఈనెల 31వ తేదీ నాటికి గరిష్ఠంగా 58 ఏళ్ల వయసు, స్కూల్ అసిస్టెంట్‌గా ఐదేళ్ల బోధనానుభవం, సబ్జెక్టులో పీజీ, ఎంఈడీలో 55 శాతం మార్కులతో పాసై, ఇంగ్లిష్, కంప్యూటర్ ప్రావీణ్యం ఉన్నవారు అర్హులన్నారు. ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నవంబరు 5 నుంచి 8వతేదీ వరకు రాతపరీక్ష నిర్వహిస్తారన్నారు. అర్హత, ఆసక్తి గల స్కూల్ అసిస్టెంట్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తర్వాత దరఖాస్తు, విద్యార్హత పత్రాలను డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అందించాలన్నారు. బుక్కపట్నం డైట్‌లో ఖాళీల వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచామని డీఈఓ తెలిపారు.

టమోటా కిలో రూ.33

అనంతపురంరూరల్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో గురువారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.17, సరసరిగా రూ.24తో విక్రయాలు జరిగాయన్నారు.

ఉచిత బస్సు ఆరోగ్యమస్తు..!

● పెద్దాస్పత్రికి పెరిగిన ఓపీ
● సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న వైనం
● శుభపరిణామం అంటున్న వైద్యవర్గాలు

ఫ్రీ బస్సు ఎఫెక్ట్.. ఆరోగ్యంపై మహిళల శ్రద్ధ

పల్లెటూరి మహిళలు ఆరోగ్యం గురించి పట్టించుకునే పరిస్థితులు తక్కువ. ఇబ్బందిగా ఉన్నా.. ఆర్థిక పరిస్థితులు, ఇతరత్రా కారణాలతో నగరాలు, పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేకపోతుంటారు. జబ్బు ముదిరాక ఆస్పత్రులకు పరుగులు పెట్టినా.. డబ్బు వృథా తప్ప.. ప్రయోజనం ఉండకపోవచ్చు. జబ్బు ప్రారంభదశలోనే పరీక్షలు చేయించుకుని, చికిత్స తీసుకుంటే నయమయ్యే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన స్త్రీ శక్తి పథకం వారికి వరంగా మారింది. ఉచిత బస్సు ప్రయాణంతో చాలామంది మహిళలు ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే నగరాలు, పట్టణాలకు వెళ్తున్నారు. సొంత ఖర్చులు పెట్టుకుంటే చాలు. వారిపై రవాణా భారం తగ్గుతోంది. దీంతో పెద్దాస్పత్రులకు అధిక సంఖ్యలో వచ్చి, పరీక్షలు చేయించుకుని, వైద్యం పొందుతున్నారు. స్త్రీ శక్తి ప్రవేశ పెట్టాక జిల్లా సర్వజనాస్పత్రికి మహిళా ఓపీ విపరీతంగా పెరగడమే ఇందుకు నిదర్శనం.





గైనిక్ ఓపీలో మహిళలు

అనంతపురం వైద్యం, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయాణం పథకం.. వారి స్వీయ ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా దోహదపడుతోంది. ఊర్లో బస్సు ఎక్కి అనంతపురంలో దిగి పెద్దాస్పత్రికి వస్తున్నారు. సొంత ఖర్చులు మినహా చార్జీల భారంలేదు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పెద్ద డాక్టర్లు ఉంటారనీ, అక్కడికెళ్లి డాక్టర్‌తో చూపించుకుంటే అన్నిరకాల పరీక్షలు చేస్తారు, ఎలాంటి ఆరోగ్య సమస్య ఉన్నా.. ప్రారంభ దశలోనే చూపించుకుంటే వాటి నుంచి బయటపడవచ్చని మహిళలు భావిస్తున్నారు. ఆ మేరకు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. ఇలా.. ఉచిత బస్సు పథకాన్ని ఆరోగ్య పరిరక్షణకు మహిళలు వినియోగిస్తుండడం హర్షణీయం.

సుదూర ప్రాంతాల నుంచి...

ఉచిత బస్సు ప్రయాణం అమలు కావడంతో ఉమ్మడి జిల్లాలోని సుదూర ప్రాంతాలనుంచి మహిళలు పెద్దాస్పత్రికి తరలివస్తున్నారు. కుటుంబ సభ్యుల ఆసరా లేకుండా వైద్యసేవలు పొందేందుకు మహిళలే సొంతంగా ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తుండటం విశేషం. ఇంటి అవసరాల కోసం తప్పని పరిస్థితుల్లో కుటుంబంలోని పురుషులే అనంతపురం వచ్చేవారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలైన రాయదుర్గం, కణేకల్లు, గుంతకల్లు, తాడిపత్రి, కదిరి, అమరాపురం ఇలా అన్ని మండలాల నుంచి మహిళలు వారి ఆరోగ్యం కోసం ఆస్పత్రికి వస్తుండటం శుభపరిణామమని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. కర్నూలు, కడప జిల్లాల్లోని సరిహద్దు మండలాల మహిళలు సర్వజన వైద్యశాలకే వస్తున్నారు. దీంతో మహిళా ఓపీ పెరిగింది. అవసరమైన వారిని అడ్మిషన్ చేసుకుని, వైద్య సేవలు అందిస్తున్నామనీ, కడుపునొప్పి, గర్భసంచి, చెవి, కళ్లు వంటి ఆపరేషన్లు చేస్తున్నామని వైద్యవర్గాలు వివరిస్తున్నాయి.

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెలవారీగా ఓపీ వివరాలు...			
నెల	మొత్తం ఓపీ	మహిళా ఓపీ	శాతం
ఏప్రిల్	52,545	20,492	39
మే	49,575	20,325	41
జూన్	58,672	22,291	37
జూలై	61,965	25,045	40
ఆగస్టు	67,742	31,885	47
సెప్టెంబరు	74,967	38,982	52



కంటి చికిత్స విభాగంలో మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

తొలిసారి వచ్చా



ఉచిత బస్సు పథకం అమలు తరువాత తొలిసారి పెద్దాస్పత్రికి వచ్చా. అనంతపురం రావాలంటే రూ.200 చార్జీనే అవుతుంది. దీంతో ఖర్చులు భరించలేక అనారోగ్యంగా ఉంటే కొత్తచెరువు, ధర్మవరంలోనే చూపించుకునేవారం. పెద్దాస్పత్రిలో అయితే అన్నిరకాలుగా పరీక్షలుచేసి మందులు ఇస్తారు. చార్జీలేదు కాబట్టి, ప్రస్తుతం ఉచిత బస్సులో అనంతపురం వచ్చా. అనవసరంగా ఎక్కి దిగకుండా ఇలాంటి అవసరాలకు ఫ్రీబస్సు ఉపయోగపడుతుంది.

- నాగమ్మ, కొడపగానిపల్లి, కొత్తచెరువు మండలం

పెరిగిన శాతం...

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిత్యం రెండువేల నుంచి మూడువేల వరకు ఓపీ నమోదవుతోంది. సాధారణంగా ఎక్కువశాతం పురుషులే ఆస్పత్రికి వస్తారు. ఉచిత బస్సు పథకం ప్రారంభం నుంచి ఓపీ గణాంకాల్లో మార్పులు వచ్చాయి. పురుషుల కంటే మహిళా ఓపీ పెరిగింది. జనరల్ మెడిసిన్, గైనిక్, సర్జరీ, ఈఎన్‌టీ, ఆప్తాలమిక్ ఓపీలకు మహిళలు ఎక్కువగా వస్తున్నారు. గత నెలలో ఏకంగా 38,982 మంది మహిళలు ఓపీ చూపించుకోవడం ఇందుకు నిదర్శనమని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1631.92
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	21,697	1,09,314
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	12,696	1,09,074
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.46

ఆటో బోల్తా.. బాలిక మృతి

రాయచూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా ముదగల్ పట్టణ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదేళ్ల బాలిక అనుశ్రీ మృత్యువాత పడింది. లింగసుగూరు తాలూకాలోని చత్ర గ్రామంలో వెలసిన మారుతేశ్వర స్వామి దేవాలయం దర్శన ముగించుకుని కుటుంబం ఆటోలో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆటో డ్రైవర్ వేగంగా నడుపుతూ అదుపు తప్పడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఆటో బోల్తాకొట్టిన తక్షణమే బాలిక అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురైదురికి తీవ్ర గాయాలైయ్యాయి. సంఘటన స్థలాన్ని ముదగల్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతి చెందిన బాలిక యరగుంటా గ్రామానికి చెందినదిగా పోలీసులు తెలిపారు. బాలిక మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ఎడ్లబండి బోల్తా.. వృద్ధుడి మృతి

పరిగి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలోని సద్దెలకుంట మలుపు వద్ద ఎడ్ల బండి బోల్తాపడిటన ఘటనలో నారాయణప్ప(69) అనే వృద్ధుడు మృతిచెందినట్లు జమేదార్ శ్రీనివాసులు తెలిపారు. గొరవనహళ్లి గ్రామానికి చెందిన నారాయణప్ప బుధవారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి వస్తున్న సమయంలో సద్దెలకుంట మలుపువద్ద ఎడ్లబండి అదుపుతప్పి బోల్తాపడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి ద్విచక్రవాహనం సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గురువారం కుమారుడు సోమశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాఠశాలలో చోరీపై ఫిర్యాదు

మడకశిర రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్రేపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన చోరీపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసినట్లు హెచ్ఎం మహేష్ తెలిపారు. మూడు రోజులు వరుసగా పాఠశాలలకు సెలవులు రావడంతో బుధవారం ఉదయం పాఠశాలకు విధులకు హాజరు కావడానికి వెళ్లగా అప్పటికే పాఠశాల తలుపులు, బీరువా తెరిచి ఉన్నాయని తెలిపారు. ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు తెలిపారు. భద్రపరిచిన 30 భోజనం ప్లేట్లు, కోడిగుడ్లు, చిక్కీలు ఎత్తుకెళ్లారని తెలిపారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

బళ్లారి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని పలు ప్రాంతాల్లో దీపావళి వేళ పేకాట స్థావరాలపై పోలీసులు భారీగా దాడులు జరిపారు. బళ్లారి, బళ్లారి గ్రామీణ, సిరుగుప్ప, కురుగోడు, కంప్లి. సండూరు తదితర ప్రాంతాల్లో మూడురోజుల పాటు జరిపిన దాడుల్లో 178 కేసులు నమోదు చేయగా అందులో 1136 మందిని అరెస్టు చేశామని, వారి వద్ద నుంచి రూ.17,31,140 స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ శోభారాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

మహిళలకు ఆదర్శం.. రాణి చెన్నమ్మ

బళ్లారి జిల్లా తోలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ముండ్రగి నాగరాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ముండ్రగి నాగరాజు



సిరుగుప్ప డిప్యూటీ తహసీల్దార్ కార్యాలయంలో..

బళ్లారి సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కిత్తూరు రాణి చెన్నమ్మ ధైర్యసాహసాలు మహిళలందరికీ ఆదర్శం అని బాబుజగ్జీవన్‌రామ్ తోలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు ముండ్రగి నాగరాజు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధురాలు చన్నమ్మ జయంతిని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం గురువారం నగరంలోని సాంస్కృతిక సముదాయంలోని ఆడిటోరియంలో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్రిటీషువారికి సింహస్వప్నంగా నిలిచిన చెన్నమ్మ ధైర్యం నేటి విద్యార్థులకు , మహిళలకు ఆదర్శంగా నిలిచారన్నారు. నేటి యువత ఆమె ధైర్యాన్ని పుణికిపుచ్చుకుని సమస్యలపై పోరాట స్ఫూర్తిని పెంచుకోవాలన్నారు. ఈసందర్భంగా కర్ణాటక స్టేట్ మినరల్స్ కార్పోరేషన్ లిమిటెడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమటి లక్ష్మణ, తాలూకా హామీ పథకం అమలు అథారిటీ అధ్యక్షుడు గోనాల్ నాగభూషణ్ గౌడ, వీరశైవ లింగాయత్ పంచమసాలి అధ్యక్షుడు వీరనాగౌడ, లెక్చరర్ కళావతి, సంఘం నాయకులు కొట్రేశ్, హంపనగౌడ, ఎర్రిస్వామి, బసవన్నగౌడ, కన్నడ శాఖ సహాయ సంచాలకులు రాజేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సిరుగుప్ప (ఆంధ్రజ్యోతి): కిత్తూరు రాణి చెన్నమ్మ 248వ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. సిరుగుప్ప తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ చన్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన వీరనారి కిత్తూరు రాణి చన్నమను కొనియాడారు.ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ మేనేజర్ రాఘవేంద్ర, మహంతేష్, శేఖర్, సమాజసేవకులు అబ్దుల్ నబీ, సిబ్బంది పాల్గొన్నారు.



కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో..

కంప్లి(ఆంధ్రజ్యోతి): దేశంలో స్వాతంత్ర్య పోరాటాన్ని రగిలించిన తొలి మహిళా పోరాట యోధురాలు కిత్తూరు రాణి చెన్నమ్మని ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దార్ జుగల్ మంజునాయక్ తెలిపారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీరశైవ లింగాయత్ పంచమశాలి సంఘం ఆధ్వర్యంలో కిత్తూరు రాణిచెన్నమ్మ జయంతి జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో కిత్తూరు రాణి చెన్నమ్మ చూపిన ధైర్యం సాహసం దేశంలోని ప్రతి మహిళను ఆదర్శంగా ఆమె రాజ కుటుంబం నుండి వచ్చినందున ఆమె చిన్నతనం నుండే గుర్రపుస్వారీ, కత్తి యుద్ధం లో శిక్షణ పొందిందన్నారు.. ఈ సందర్భంగా నాయకులు కేఎం హేమయ్యస్వామి, మూకయ్యస్వామి, బీవీ గౌడ, కనకగిరి రేణుకగౌడ, ఎస్‌డీ బసవరాజ, అమరేగౌడ, శరణప్ప, ఈరణ్ణ, కుమారస్వామి, సచిన్, శరణప్ప, కే వీరేష్, కే శశిధర్, శరణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయచూరు (ఆంధ్రజ్యోతి): కిత్తూరురాణి చెన్నమ్మ స్వాతంత్ర్య పోరాట యోధురాలని, బ్రిటీషులను ధైర్యంగా ఎదుర్కొని స్వాతంత్ర్య సంగ్రామంలో తనవంతుగా పోరాటాన్ని చేపట్టారని అడిషనల్ ఎస్పీ కుమారస్వామి గుర్తు చేశారు. నగరంలోని రంగమందిరంలో జయంతి వేడుకలు జరుపుకున్నారు.



రాయచూరులో రాణి చెన్నమ్మ చిత్రపటం వద్ద అధికారుల నివాళి

మార్కుల జాబితాలు పంపిణీ చేయాలి

● వీసీకి దళిత రక్షణ వేదిక వినతి



వీసీకి వినతి పత్రం అందజేస్తున్న దళిత రక్షణ వేదిక నాయకులు

బళ్లారి సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బళ్లారి, విజయనగరం జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల విద్యార్థుల మార్కుల పత్రాలను తక్షణమే జారీ చేయాలని, విద్యార్థులను ఇబ్బంది పెట్టడం తగదని దళిత రక్షణ వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం వీఎస్కేయూ వైస్ చాన్స్‌లర్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కుల పత్రాలను పంపిణీ చేయని ప్రిన్సిపాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంలో కర్ణాటక దళిత రక్షణ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌నందిహాళ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమేశ్ కత్తిమణి, చలవాది మహాసభ జిల్లాధ్యక్షుడు శివకుమార్, చలవాది మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు మానయ్య తదితరులుపాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు 551 ప్రత్యేక బస్సులు

● ఆర్టీసీ కడప జోన్ ఈడీ చంద్రశేఖర్

కడప మారుతీనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని కడప జోన్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఉన్న శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం 551 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప జోన్ ఈడీ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కడపలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శైవక్షేత్రాలను దర్శించుకునేందుకు భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేసి సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. ఆ మేరకు కడప జోన్ పరిధిలో గల తిరుపతి డిపో నుంచి 10 బస్సులు, చిత్తూరు 20, అన్నమయ్య 56, కడప జిల్లా నుంచి 60, కర్నూలు 110, నంద్యాల జిల్లా నుంచి 127, అనంతపురం నుంచి 66, శ్రీసత్యసాయి జిల్లా నుంచి 102 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే బస్సుల కండిషన్‌ను మరింత మెరుగుపరిచి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిద్ధం చేశామన్నారు.



హంపిలోని బడవిలింగేశ్వర ఆలయం

హంపిలో ఆకతాయిల దుశ్చర్య

● బడవిలింగేశ్వరుడి బావిలో చెప్పులు, బీరు బాటిళ్లు

● పురావస్తు అధికారులకు ఫిర్యాదు చేసిన భక్తులు

బళ్లారి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రగా గుర్తింపు పొందిన హంపిలో శ్రీకృష్ణదేవరాయ కాలంలో స్థాపించిన బడవిలింగేశ్వర బావిని పవిత్రంగా భావిస్తారు. అయితే నీటిని కొందరు ఆకతాయిలు ఇక్కడ నీటిని అపవిత్రం చేస్తున్నారు. బావిలో వ్యర్థాలు, చెప్పులు, బ్రాందీ బాటిళ్ల పడేసి అపరిశుభ్రం చేస్తున్నారు. రాయల కాలం నాటి బావిలో నిత్యం నీరు ప్రవహించేలా ఏర్పాటు చేశారు. గర్భగుడిలోకి నీరు వెల్లి బడవిలింగేశ్వర చుట్టూ చేరి పూర్తీగా నిండిన తరువాత అనీరు కొన్ని కాలువ ద్వారానే బయటకు రావడం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ బడవిలింగేశ్వర చుట్టూ నీరు నిల్వ ఉంటాయి. పర్యాటకులు లోపలికి వెల్లకుండా ఇనుప కడ్డీలతో గ్యాలరీ ఏర్పాటు చేశారు. అయితే ఎవరో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం సాయంత్రం చెప్పులు, బ్రాందీ బాటిల్లు వేశారు. దీన్ని పర్యాటకులు గురువారం గుర్తించి అక్కడ పురావస్తు శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తొలగించిన అధికారులు ఆకతాయిల కోసం ఆరా తీస్తున్నారు.



నీటిలో తేలియాడుతున్న చెప్పు, బాటిల్

మాజీ ఎంపీపై చర్యలకు వినతి



తహసీల్దార్ షణ్ముఖప్పకు వినతిపత్రం అందజేస్తున్న వాల్మీకి నాయకులు

కంప్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ తెగలపై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ రమేష్ విశ్వనాథ్ కత్తిపై కఠినచర్యలు తీసుకోవాలని అఖిల కర్ణాటక వాల్మీకి నాయక్ మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తాలుకా గ్రేడ్-2 తహసీల్దార్ షణ్ముఖప్పకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమాజం అధ్యక్షుడు నీరుగంటి వీరేష్ మాట్లాడుతూ బహిరంగ వేదికపై వాల్మీకి సమాజంపై అవమాన కరమైన పదాలు, ఇతర అనాలోచిత పదాలను రమేస్ ఉపయోగించారన్నారు. సమాజ గౌరవాన్ని దెబ్బతీసింది. అతనిపై షెడ్యూల్డ్ కులాలు, తెగల చట్టం కింద కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, వన్నూర్, దేవన్న, ఎం లోకేష్, రంగయ్య, శేఖర్ హలుమార, ఈరణ్ణ బెళగోడు నాగరాజు, టీ దేవ, టీ రామయ్య లింగప్ప, గిరియప్ప, మావినహళ్లి, ముదియప్ప, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

సర్వేను సక్రమంగా చేపట్టాలి

● దేవదాసీల డిమాండ్



సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దేవదాసీలు

సిరుగుప్ప, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దేవదాసీల సర్వేను సక్రమంగా చేయాలని దేవదాసీల సంఘం అధ్యక్షురాలు ఈరమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిరుగుప్ప పట్టణం శిశు అభివృద్ధి యోజన కార్యాలయం ముందు దేవదాసీల డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా దేవదాసీలు జోరుగా నినాదాలు చేశారు. 1984వ సంవత్సరం వరకు దేవదాసీల సర్వేలు జరిగేవని, కానీ ఆ తర్వాత నిలిపివేశారన్నారు. ఇప్పటి ప్రభుత్వం సర్వేను చేపట్టాలని కోరారు. ఈ ధర్నాలో దేవదాసీల సంఘం ఉపాధ్యక్షురాలు దుర్గమ్మ, రేణుకమ్మ, హుస్సేనమ్మ, దేవదాసీలు పాల్గొన్నారు.

తుర్విహాళ్ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే బసనగౌడ ఆర్ తుర్విహాళ్

● ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ యూనిట్ ప్రారంభం



డయాలసిస్ కేంద్రంలో ఎమ్మెల్యే బసనగౌడ, వైద్య సిబ్బంది

రాయచూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోనే అతి పెద్ద క్లస్టర్ కేంద్రంగా ఉన్న తుర్విహాళ్ పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు నిబద్ధతతో పని చేస్తానని మస్కి ఎమ్మెల్యే, ఖాధి గ్రామోద్యోగ మండలి రాష్ట్ర అధ్యక్షుడు బసనగౌడ ఆర్ తుర్విహాళ్ అన్నారు. తుర్విహాళ్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలిసిస్ యూనిట్‌ను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే, తాలూకా కేంద్రం కాకుండా కేవలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో డయాలిసిస్ యూనిట్ ఏర్పాటు కావడం ఒక్క తుర్విహాళ్‌లోనే జరిగిందని ఈ ప్రాంతానికి గర్వకారణమన్నారు. బాధితులు, సమీప గ్రామాల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, తక్షణ సేవల కొరకే డయాలసిస్ యూనిట్ ప్రారంభించామన్నారు. దీంతో పాటు పట్టణాన్ని తాలూకా స్థాయిలో అభివృద్ధి చేసేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివరించారు. కాగా తుర్విహాళ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సకాలంలో అందుబాటులో ఉండి చికిత్స కోసం వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది కేంద్ర స్థానంలోనే నివాసం ఉంటు అన్ని వేళల ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

హోసూరు జోన్



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

వేల్ మురుగన్ ఆలయంలో విశేష పూజలు

హోసూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పెరియార్‌నగర్‌లోని వేల్‌మురుగన్ ఆలయంలో మహాస్కంధ షష్టి ఉత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో సాగింది. తెల్లవారు జామునుంచే ఆలయంలో వేల్‌మురుగన్‌కు విశేషపూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం చందనం అలంకరణ చేశారు. మహామంగళారతి అనంతరం మహాయాగశాలలో ప్రత్యేక హోమం నిర్వహించారు. ఈనెల 28వరకు ఉత్సవం కొనసాగనుంది. 26న ఆదివారం సుబ్రమణ్యస్వామి తల్లి పార్వతీదేవి నుంచి వేలాయుధం స్వీకరిస్తాడు. 27న సోమవారం అసురసంహార కార్యక్రమం జరగనుంది. 28న మురుగన్ తిరుకల్యాణ వైభవం జరగనుంది. ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటుకు డిమాండ్

హోసూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇటీవల వరుస వర్షాలతో జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో సరిహద్దులోని బెంగళూరులో కూడా వర్షాలు కురుస్తున్నాయి. ప్రతినిత్యం సాయంత్రం వేళల్లో మేఘావృతమై ఒక మోస్తరు వర్షం కురుస్తోంది. ఉదయం ఎండ, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో విభిన్నమైన వాతావరణం నెలకొంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో చేరేవారిసంఖ్య పెరుగుతోంది. కాగా బస్టాండ్‌తో పాటు బహిరంగ ప్రదేశాలలో వర్షపునీరు ఎక్కువగా నిల్వ ఉంటోంది. దోమలు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుల, మత రాజకీయాలకే పాలకుల ప్రాధాన్యం

● కేఆర్ఎస్ రాష్ట్ర రైతు కార్యదర్శి గోమర్సి ● కన్నడ భాషకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్



ప్రచారంలో కేఆర్ఎస్ పార్టీ నాయకులు

బళ్లారి సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కుల, మత రాజకీయాలకే ప్రస్తుత పాలకులు ప్రాధాన్యం ఇస్తున్నారని కేఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. బళ్లారి జిల్లా సండూర్‌లో కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ నిర్వహించిన ప్రచారం విజయవంతంగా ముగిసింది. గురువారం ప్రజలకు అవగాహన కల్పించడానికి , పార్టీ సభ్యులుగా చేరడానికి తాలూకాలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో కేఆర్ఎస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గోమర్సి మాట్లాడుతూ ఇటీవలి కాలంలో కన్నడిగులు అనుభవిస్తున్న బాధలు, కష్టాలకు పాలకులే కారణమన్నారు. స్వార్థ రాజకీయాలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రజలను పరిపాలించాల్సిన నాయకులు కుల రాజకీయాలు, ధన సంపాధనకే పరిమితమయ్యారన్నారు. భూమి, నీరు, సరిహద్దు భాష మనుగడ, ఉపాధిలో కన్నడిగులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. నవంబర్‌లో భారీ సమావేశం నిర్వహిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి ఖాదర్‌బాషా మాట్లాడుతూ రైతులు, మహిళలు, విద్యార్థులు, వ్యవసాయ కార్మికులు మెరుగైన జీవితాన్ని గడమపడమే తమ లక్ష్యమన్నారు. ఈ గందరగోళాన్ని వ్యతిరేకిస్తూ కన్నడిగులలో అవగాహన కల్పించడానికి , రాష్ట కేంద్ర ప్రభుత్వ వివిధ పథకాల గురించి ప్రజలకు చేరువ కావడానికి ఈ ప్రచారాన్ని నిర్వహించాలని ఆయన అభ్యర్థించారు. కన్నడ అనుకూల, రైతు అనుకూల,ప్రగతిశీల సంస్థల నాయకులు దీనికి మద్దతు ఇవ్వాలని కోరారు. అవినీతి రాజకీయాలకు సెలవు పలకాలన్నారు. ఈసందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాకార్యదర్శి కట్టిబసప్ప, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్ధనరెడ్డి, సండూర్ తాలూకా అధ్యక్షుడు మంజునాథ్‌గౌలి, ఉపాధ్యక్షుడు శర్మాస్ వలీ, ప్రధాన కార్యదర్శి రవి, కార్యదర్శులు మెహబూబ్,పంపాపతి,నాముునాయక్, ఇమామ్ భాషా, సురేశ్, శరణ్ మోహన్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రబీకి నీరివ్వాలి: రైతు సంఘం



నీటిపారుదల శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కంప్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుండి రబీ పంటకు సాగు నీరు విడుదల చేయాలని రైతు సంఘం (హసురుసేన) జిల్లా అధ్యక్షుడు బీవీ గౌడ కోరారు. గురువారం మున్రాబాద్‌లో చిన్న నీటిపారుదల శాఖ సీఈ లక్ష్మణ్ నాయక్‌కు నీటిపారుదల శాఖ మంత్రులకు అధికారులకు రాసిన లేఖను అందించారు. ఈ సందర్భంగా బీవీగౌడ మాట్లాడుతూ.. వేసవిలో పంటలు పండించకపోతే రైతులు పూర్తిగా నష్టపోతారని, రైతు శ్రేయస్సును దృష్టిలో వుంచుకుని గేట్లు మరమ్మత్తు పనులు చేస్తూ నీటిని నిల్వ వుంచుకుంటూ కాలువలకు నీరు విడుదల చేస్తూ రైతులకు రబీలో కూడా నీటిని విడుదల చేయాలన్నారు. త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి సమావేశంలో తీర్మానం తీసుకోవాలని అధికారులు కోరారు. ఖరీఫ్ పంటలో రైతులు తెగుళ్ల వర్షపాతానికి పంటలు పూర్తిగా నష్టపోయి అప్పులపాలై ఇబ్బందులు ఎదుర్కొని సతమతమవుతున్నారన్నారు. రెండవ పంటకు కూడా నీటిని విడుదల చేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తిమ్మప్పనాయక్, రమేష్, మురారి, గంగన్న, మంజు, రాజు, తాయప్ప, హలేష్, జడెప్ప తదితరులు పాల్గొన్నారు.